యువకుడు అదృశ్యం

మహమ్మద్ ఫజలుద్దీన్ (ఫైల్

శేరిలింగంపల్లి, మే 22 : ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...చాంద్రాయణగుట్ట ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫజలుద్దీన్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వేవ్‌రాక్ ఐటీ పార్కు బిల్డింగ్‌లోని బిర్లా సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీసీటీవీ సర్వీస్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లిన ఫజలుద్దీన్ రాత్రి 9 గంటలకు తిరిగి రాలేదు. ఆఫీస్‌లో విచారించగా వెళ్లిపోయాడని తెలిపారు. బుధవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలీసెట్‌కు సర్వం సిద్ధం

మేడ్చల్, మే 22: రాష్ట్ర వ్యాప్తంగా పాలీసెట్ శుక్రవారం జరుగనుందని మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. మూడేండ్ల ఇంజినీరింగ్ నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలీసెట్ జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు మేడ్చల్ పట్టణంలో 8 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఆర్, స్ఫూర్తి జూనియర్ కళాశాలలు, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, ప్రభుత్వ ఐటీఐ, హైటెక్ వ్యాలీ, హైటెక్ మోడ్రన్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో ప్రింట్ కాకపోతే పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని ఆమె సూచించారు.



గోకుల్ ప్లాట్స్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

విజయం మనదే : ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మే 22 : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని గెలుపుకోసం పార్టీ శ్రేణులు చేసిన కృషి అమోఘమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, పార్టీ శ్రేణుల కష్టం వెరసి ఎన్నికల్లో తమదే విజయమన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు, పార్టీ శ్రేణులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయంగా ఎన్నో మార్పులు, చేర్పులు జరిగినా గులాబీ శ్రేణులు ఏమాత్రం స్థైర్యం కోల్పోకుండా నిజమైన సైనికుల్లా ఎన్నికల్లో పనిచేశారన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని వారికృషి వల్లే తనకు మూడు పర్యాయాలు అఖండ మెజార్టీ వచ్చిందని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడు అండగా నిలుస్తానని, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పార్టీని మరింత పరిపుష్టం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముమ్ముందు ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు ఈ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, దుర్గారావు, సుబ్బారావు, రాంమోహన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వసంత్, అశోక్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం..

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పటల్‌లో బుధవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మమతా రఘువీర్ మాట్లాడుతూ.. నర్సుల వృత్తి ఎంతో పవిత్రమైనదని రోగులకు ఎన్నో సేవలు అందించి వారు ఆరోగ్య పరంగా ఎంతో స్వస్థత పొందేలా కృషి చేస్తారన్నారు. నేటి పరిస్థితుల్లో మహిళలు ఎంతో వత్తిడికి గురవుతున్నారని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ చైర్మన్ డాక్టర్ రామచంద్ర, ఎండీ డాక్టర్ తుషార, కామాక్షమ్మ, ఇతర వైద్యులు, సిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.

– మియాపూర్, మే 22

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..



సర్ఫన్ సబేర్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, మే 22: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం మల్కాజిగిరి డివిజన్ కృపాపాంప్లెక్స్‌కు చెందిన సర్ఫన్ సబేర్ సీఎంఆర్ఎఫ్ నుంచి వారి చికిత్స కోసం రూ.1.50లక్షలు మంజూరు కాగా ఆ పత్రాలను ఎమ్మెల్యే వారికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, జేఏసీ వెంకన్న, రామయాదవ్, వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్, మణిరత్నం, సాయి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం వికలాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్ రావు, నరేంద్రరెడ్డి, రామకృష్ణ గౌడ్, అనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

– మియాపూర్, మే 22

ఘనంగా తేనె లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

ఉప్పల్, మే 22: ఉప్పల్ బీరప్పగడ్డలోని తేనె లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. కల్యాణం సందర్భంగా స్వామివాకి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఆనంద్, శ్రీనివాస్, సామల నాగరాజు, మాడిషెట్టి సత్యనారాయణ,ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 22 : కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈలు చైతన్య, విద్యాసాగర్‌లు ప్రకటనలో తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో : ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కేపీహెచ్‌బీకాలనీ బ్రాండ్ ఫ్యాక్టరీ బ్యాక్‌సైడ్, బతుకమ్మకుంట, ఎంఐజీ 887, దోబీఘాట్, రమ్యాగ్రౌండ్, చైతన్య ఫుడ్‌కోర్టు, మల్లారెడ్డి డీటీఆర్, ఎంఐజీ ప్లాట్స్, వినాయక టెంపుల్, కన్యాక పరమేశ్వరి టెంపుల్, ఇండివిజివల్ ఎల్ఐజీ పరిసర ప్రాంతాల్లో, అలాగే.. సాయంత్రం 2 నుంచి 4 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ ఎంఐజీ 570, ఎంఐజీ 701 – 850 వరకు, చర్చి, భువన విజయం గ్రౌండ్ పరిసర ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

కూకట్‌పల్లి పరిధిలో : ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు కూకట్‌పల్లి చిత్తారమ్మ టెంపుల్, సప్తగిరి కాలనీ పరిసర ప్రాంతా ల్లో... అలాగే.. మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు శేషాద్రినగర్, వెంకట్‌రావు నగర్, టవర్‌లైన్ రోడ్డు, సాయిబాబా నగర్ పరిసర ప్రాంతాల్లో... అలాగే.. సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు బాలాకృష్ణానగర్, శ్రీకృష్ణానగర్, లక్ష్మీనగర్, వివేకానందనగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్య కోరారు.

బాలాజీనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ..

బాలాజీనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కైత్లాపూర్, సప్తర్‌నగర్, యూసప్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 3.50 గంటల వరకు కైత్లాపూర్ గ్రామం, రాఘవేంద్రకాలనీ పరిసర ప్రాంతాల్లో... సాయంత్రం 3.50 నుంచి 5 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ విద్యాసాగర్ తెలిపారు.

గాజులరామారం పరిధిలో..

కుత్బుల్లాపూర్,మే 22 : 11కేవీ మినీఇండస్ట్రీ ఫీడర్ గాజులరామా రం సబ్‌స్టేషన్ పరిధిలో గురువా రం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పలు మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్యభార్గవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వల్లభాయ్‌పటేల్ నగర్, వివేకానందనగర్, శ్రీనివాసనగర్, ఆర్‌నగర్ మెయిన్‌రోడ్‌తో పాటు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు 11కేవీ హెచ్ ఏల్ ఫీడర్ పరిధిలో ఉషోదయకాలనీ ఫేస్-1,2, ఇంద్రానగర్, సీఎంఆర్ స్కూల్ వెనకాల, పీపీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

కొండాపూర్, మే 22 : కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు హుందయ్ ఆఫీస్ పరిసరాల్లో, మాతాభువనేశ్వరీ, ఖానామెట్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి 3:30 గంటల వరకు ఇజ్జత్‌నగర్ వీకర్ సెక్షన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నల్లగండ్లలో...

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జవహర్ నవోదయ, కంచె గచ్చిబౌలి, అబోడ్ స్కూల్, అపర్ణ సరోవర్ ఎదురుగా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లక్ష్మీ విహార్ ఫేజ్ -1, ఫేజ్ -2, డిఫెన్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీ, సౌత్‌పార్కుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మాధవరం నగర్ ఫీడర్ పరిధిలో..

మియాపూర్, మే 22 : విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం 11 కేవీ మాధవరం నగర్ ఫీడర్ పరిధిలో మాధవరం నగర్, కమలప్రసన్ననగర్, ఫేజ్ 1, దీనబంధు కాలనీప్రాంతాల్లో గురువారం ఉదయం 10-12.30 గంటల వరకు, 11 కేవీ ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో సాయినగర్, సాయి కల్యాణ మంటపం, రాఘవేంద్ర కాలనీప్రాంతాల్లో 1.30- 3 గంటల వరకు ,అలాగే..11కేవీ జన్మభూమి కాలనీ ఫీడర్ పరిధిలో జన్మభూమి కాలనీ, శివమ్మ బస్తీ, దత్తాత్రేయ కాలనీ, కమలమ్మ బస్తీ, పీజేఆర్‌నగర్ బ్లాక్ 60-70 ప్రాంతాల్లో ఉదయం 11-12.30 వరకు , 11 కేవీ పోలీస్ స్టేషన్ పరిధిలో జలవాయువిహార్ కాలనీ, అడ్డగుట్ట రోడ్ నంబర్ 10,11,12, సమతానగర్‌లలో మధ్యాహ్నం 1.30-3 గంటలవరకు , 11 కేవీ హెచ్ఎంటీ హిల్స్ ఫీడర్ పరిధిలో అడ్డగుట్ట రోడ్ నంబర్ 1, 2, 3లలో 3.30-5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈలు తెలిపారు. 11 కేవీ కేంద్రియ విహార్ ఫీడర్ పరిధిలో మయూరీనగర్, కేంద్రియ విహార్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో 1.30-3 గంటల వరకు, 11 కేవీ రెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలో రెడ్డి కాలనీ, బీకే ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30-5 గంటల వరకు , 11 కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్ పరిధిలో గోకరాజు కళాశాల, వెంకట్రాయ్‌నగర్ కాలనీ, బాలాజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు , ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గోవా మెగా చాంపియన్‌షిప్ కరాటే టైటిల్ విన్నర్‌లుగా రవి, రాకేశ్

గోవాలో జరిగిన యూనివర్సల్ 369 గోవా మెగా చాంపియన్ షిప్ ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కూకట్‌పల్లికి చెందిన రవి అండ్ రాకేశ్‌లు టైటిల్ విన్నర్‌లుగా నిలిచారు. బుధవారం గోవాలో జరిగిన ఫైనల్ పోటీల్లో హైదరాబాద్‌లోని నీయుధాలీ మార్షల్ అకాడమీకి చెందిన రవి, రాకేశ్‌లు బ్లాక్ బెల్ట్ విభాగంలో టైటిల్ విన్నర్‌లుగా నిలిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 16 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా... రాష్ట్రం నుంచి బరిలో దిగిన రవి, రాకేశ్‌లు తుది విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కోచ్‌లు సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ... ఈ ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలను సాధించడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించి గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని అభినందించారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మే 22

భవన్స్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నేరేడ్‌మెట్,మే 22: భవన్స్ వివేకానంద కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్స్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యా యని భవన్స్ వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జిఎస్‌విఆర్‌కె. చౌదరి తెలిపారు. బుధవారం భవన్స్ కళాశాల ఆవరణలో మీడి యా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2024-25 అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ సర్వీసెస్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈనె ల 27 చివరిరోజు అని తెలిపారు. అడ్మిషన్ల కోసం కళాశాల వెబ్‌సైట్ www. bhavan svc.ac.inలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు

జవహర్‌నగర్, మే 22: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత ఇండ్లను గుర్తించాలని, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరకుండా కాల్వ వెంబడి వెళ్లేలా పనుల్లో వేగం పెంచాలని జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదని, ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర పనులు అయ్యే విధంగా కృషి చేయాలని, ప్రజాపాలనలో మెరుగైన సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ మాధవచారి, ఏఈ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవీ, ఎల్లమ్మ, రజిని, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి, తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు జాగలను కబ్జా చేస్తే సహించం

జవహర్‌నగర్, మే 22: సర్కారు జాగలో గుడిసెలు వేస్తూ దర్జాగా కబ్జాచేద్దామని చూస్తున్న అక్రమార్కులను సహించబోమని, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని కాప్రా తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లోని సర్వే నెం. 867, 868, 810లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను, గుడిసెలను తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో జవహర్‌నగర్ పోలీసుల సహాయంతో బుధవారం కూల్చివేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో నాగరాజు, అడ్మిన్ ఎస్సై ఇద్రీస్‌అలీ, ఎస్సై అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్‌రెడ్డి, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి,డిప్యూటీ తహసీల్దార్ రాధిక, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కుత్బుల్లాపూర్ కో-కన్వీనర్‌గా శివాజీరాజు

కుత్బుల్లాపూర్, మే 22 : బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో-కన్వీనర్‌గా కొంపల్లి ప్రాంతానికి చెందిన శివాజీరాజును పార్టీ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శివాజీరాజు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని, ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, మేడ్చల్ జిల్లా అర్బన్ కన్వీనర్ డా.ఎస్.మల్లారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా శేఖర్‌యాదవ్

జగద్గిరిగుట్ట, మే 22 : కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా జగద్గిరిగుట్టకు చెందిన జేకే శేఖర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయనకు పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ ప్రేమేందర్‌రెడ్డి నియామక పత్రం జారీ చేశారు. ఈసందర్భంగా బుధవారం పలువురు నేతలు శేఖర్‌యాదవ్‌ను అభినందించారు.

నూతన నియామకం

కీసర, మే 22: కీసర మండల మహాపడిపూజ నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా గుండ్లపల్లి గౌరిశంకర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం కీసర మండలం చీర్యాల్ శ్రీ మల్లికార్జున బ్రమరాంబిక ఆలయంలో ఈ సంవత్సరం వచ్చే నవంబర్ 30వ తేదీన జరిగే 18పడుల మహాపడిపూజ కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అయ్యప్ప గురుస్వాములందరు కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మహాపడిపూజ నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా గుండ్లపల్లి గౌరిశంకర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి..

- ఓయూలో ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి

భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: జీవితమంతా దళితుల అభ్యున్నతికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్(అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. నగరంలో ఆది ఆంధ్రసభ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంస్థలను స్థాపించి తెలంగాణ వైతాళికుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తు చేశారు. దేశంలో దళిత చైతన్యానికి నాంది పలికిన మహానుభావుడు భాగ్యరెడ్డివర్మ అని ప్రశంసించారు. ఉద్యమకారుడిగా, హక్కుల కార్యకర్తగా, రచయితగా, పాత్రికేయుడిగా, సంఘసంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణలో జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారని కీర్తించారు. బహుజనులే ఆది హిందువులని, ఈ విషయాన్ని అంబేద్కర్ కంటే ముందుగానే భాగ్యరెడ్డివర్మ పేర్కొన్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవ రాజు, శ్రీను, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

ఖైరతాబాద్, మే 22 : ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకూతుళ్లు కనిపించకుండా పోయారు. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.10లో నివాసముండే మహ్మద్ నవాజ్, అయేషా బేగంకు 12ఏండ్ల కుమార్తె ఉన్నారు. ఆమెకు గతంలోనే ఓ వ్యక్తితో వివాహం జరుగగా, అతడితో విడిపోయిన తర్వాత ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న నవాజ్‌ను వివాహం చేసుకుంది. అయితే ఈ నెల 21న బంజారాహిల్స్‌లోని తమ నివాసం నుంచి ఆటోలో ఆమె తల్లిగారింటికి బయలుదేరాడు. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మధ్యకు చేరుకోగా తమను ఆటోడ్రైవర్ (భర్త) కిడ్నాప్ చేశారని, కాపాడాలంటూ అరించింది. చుట్టుపక్కల ఉన్న వాహనదారులు గమనించి ఆటోడ్రైవర్‌కు దేహశుద్ధి చేసి తల్లీబిడ్డలను మరో ఆటోలో పంపించి వేశారు. అయితే ఆటోడ్రైవర్ తానే ఆమె భర్త అని పరిచయం చేసుకోగా, వాహనదారులు అతన్ని వదిలేశారు. ఇదిలా ఉండగా, ఆటోలో బయలుదేరి ఆయేషా, ఆమె కుమార్తె సాయంత్రం వరకు కూడా ఇంటికి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

వెంగళరావునగర్, మే 22 : ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్.ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటలోని ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నివాసముంటున్న బాబా షర్ఫుద్దీన్(41)కు భార్యతో విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి తల్లి దండ్రుల వద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఉరివేసుకుని మృతి చెందాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసిపెట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు.. సెలైన్లు పెట్టొద్దు

- రోగులను అడ్మిట్ చేసుకోవద్దు
- అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- పేరుకుముందు డాక్టర్ అని ఉండకూడదు
- క్లినిక్‌లు, ల్యాబ్‌లలో వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు

ప్రైవేట్ దవాఖానలో తనిఖీలు చేస్తున్న ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ రేవతి

జూబ్లీహిల్స్, మే 22 : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు హాస్పిటల్స్‌పై వైద్యాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ రేవతి యూసుఫ్‌గూడతో పాటు అమీర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని పలు ప్రైవేట్ దవాఖానలలో పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, దవాఖానలు, ఫిజియోథెరపీ సెంటర్లు, ఈఎన్‌టీ, ఐ క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు, ఆయుష్ సెంటర్లు నిబంధనల ప్రకారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు కలిగి ఉండాలని అధికారులు పేర్కొన్నారు. ఆయా వైద్య కేంద్రాలలో రోగుల నుంచి వసూలు చేసే ఫీజుల వివరాలను రిసెప్షన్ బోర్డులలో ప్రదర్శించాలని సూచించారు. రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎం